


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
మంగళవారం 10-6-2025
సంపుటి: 21 సంచిక: 66
పేజీలు: 8 వెల: రూ.1

## రూ.80 లక్షలు విలువైన 505 ఫోన్లు రికవరీ

- బాధితులకు అప్పగించిన ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సుమారు ఎనభై లక్షల రూపాయలు విలువైన 505 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ఎస్పీ కె.వి. మహేశ్వర్‌రెడ్డి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గత నాలుగు నెలల్లో వివిధ కారణాలతో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎవరైతే ఫోన్లను పోగొట్టుకున్నరో సంబంధిత బాధితులు సిఈఐఆర్ పోర్టల్, https://www.ceir.gov.in అనే పబ్లిక్ వెబ్‌సైట్‌లో ఆలస్యం లేకుండా బ్లాకింగ్ అభ్యర్థన ద్వారా రిజిస్టర్ చేసుకున్నట్లయితే ఆ కంప్లయింట్ల ఆధారంగా సదరు మొబైల్ ఐఎంఈఐ నెంబర్లు బ్లాక్ అయిన తర్వాత, ఆ రిక్వెస్ట్‌ను తాము రిసీవ్ చేసుకుని, మొబైల్‌ను ట్రాక్ చేసి, రికవరీ చేస్తామన్నారు. తర్వాత మొబైల్‌ను అన్‌బ్లాక్ చేసి మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తికి ఇస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో గత నాలుగు నెలల కాల వ్యవధిలో సుమారు 505 ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. ఇంకొన్ని మొబైల్ ఫోన్లు రికవరీ చేయవలసి ఉందని, ఇప్పటికే 9 దశలుగా రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అందజేశామని, ఇప్పుడు 10వ దశగా 505 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని, వాటి విలువ సుమారు 80 లక్షల రూపాయలు ఉంటుందని ఎస్పీ వివరించారు. మొబైల్ ఫోన్లు వాడే ప్రతిఒక్కరు ఫోన్‌లోను సెక్యూరిటీ లాక్ వేసుకోవాలని సూచించారు. పోగొట్టుకున్న దూర ప్రాంతాల్లో ఉన్న ఫోన్లతో పాటు అతి విలువైన మొబైల్ ఫోన్లను తక్కువ కాలంలోనే అదనపు ఎస్పీ కెవి రమణ పర్యవేక్షణలో ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సైబర్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీను, సిబ్బంది, సిఐ సీసీఎస్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ కేవీ రమణ, ఎస్బి సిఐ ఇమ్మాన్యుల్ రాజు, సైబర్ సెల్ సిఐ శ్రీనివాసు, సైబర్ సెల్ ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

### పరపతి, ఫోర్జరీల పోటు

# చెరువు ఉనికికే చేటు!

- రూపురేఖలు కోల్పోయిన సానివాడ బరాటం చెరువు
- కలెక్టర్ ఆదేశాలతో విచారణకు కదిలిన యంత్రాంగం
- నకిలీ పట్టాలతో నమ్మించే ప్రయత్నంలో కొందరు
- ఇళ్లు కట్టేశాం.. ఇప్పుడేలా తొలగిస్తారని ఇంకొందరి రుబాబు
- రెండు కుటుంబాల చేతుల్లోనే భూములుు

**ఉపాధి హామీ ద్వారా చెరువుల్లో పూడిక తీయడంతో పాటు వాటి విస్తీర్ణాన్ని క్రమబద్ధీకరించే విధంగా గట్లు పటిష్టపర్చడంతో జిల్లాలో కొన్నేళ్ల క్రితం ఆక్రమణలకు గురైన చెరువుల వాస్తవ రూపం ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. రాజుల కాలంలో సాగు, తాగు నీటి కోసం ప్రతి గ్రామంలో రెండు చెరువులు ఉండేవి. గ్రామం ప్రారంభంలో ఒకటి, ఊరు శివారులో ఒక చెరువు కామన్‌గా ఉంటాయి. తర్వాత కాలంలో లిఫ్ట్ ఇరిగేషన్లు, నీటిపారుదల పథకాలు రావడంతో చెరువుల కింద వ్యవసాయం తగ్గిపోయింది. దాంతో చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. అంతకంటే విచారకరమైన విషయమేమిటంటే.. ఆక్రమించిన చెరువుల్లో అదే చెరువు నుంచి తవ్విన మట్టిని నింపి వ్యవసాయం చేసుకుంటున్నవారికి ప్రభుత్వాలు పట్టాలిచ్చేశాయి. చెరువు గర్భాల్లో పట్టాలు ఇవ్వడానికి లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. కొత్త ఆక్రమణలకు దీన్ని వర్తింపజేశారు గానీ, పాత ఆక్రమణల జోలికి పోలేదు. ఎందుకంటే రాజకీయ ప్రాపకంతో రెవెన్యూ యంత్రాంగమే పట్టాలు జారీ చేసింది.**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి పనుల్లో చెరువుల తవ్వకాలకే మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. దీని వల్ల లాభనష్టాల మాటెలా ఉన్నా ప్రస్తుతానికి రెవెన్యూ రికార్డుల్లో ఉండాల్సిన మేరకు చెరువులను చదును చేయాలని స్వయంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణే ఆదేశించడంతో ఆక్రమణల తొలగింపునకు పూనుకొన్నారు. ఇక్కడే అసలు చిక్కంతా వచ్చిపడింది. దశాబ్దాల క్రితం తమకు పట్టాలిచ్చేశారని, తమ సాగులోనే ఉందని కొందరు వాదిస్తుంటే, మరికొందరు చెరువు గట్టు మీద ఎప్పుడో ఇళ్లు కట్టుకున్నాం.. ఇప్పుడు ఎలా తొలగిస్తారంటూ కోర్టు మెట్లు ఎక్కుతున్నారు. కలెక్టర్ దినకర్ పుండ్కర్ మాత్రం చెరువులను ఆక్రమించిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఎవరైనా ఖాళీ చేయకపోతే సంబంధిత స్థలాన్ని 22ఏ లో పెట్టి క్రయవిక్రయాలకు వీల్లేకుండా చేస్తున్నారు. అంతేకాకుండా రెండు చోట్ల చెరువు గట్ల మీద ఆక్రమణలు తొలగించి రోడ్డు నిర్మాణాలు కూడా ప్రారంభించారు.

### సర్పంచ్ ఫిర్యాదుతో కదిలిన డొంక

ఈ క్రమంలో శ్రీకాకుళం నియోజకవర్గం గార మండలంలోని సానివాడ చెరువులో ఆక్రమణలకు సంబంధించి రెవెన్యూ యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. ఈ గ్రామంలోని బరాటం చెరువు ఆక్రమణలకు గురైందని, రెండు మూడు కుటుంబాల చేతుల్లో చిక్కుకుందని స్వయంగా గ్రామ సర్పంచే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే రాజకీయ కక్షల నేపథ్యంలో తమ స్వాధీనంలో ఉన్న భూమిని తీసుకోవాలని కుట్ర పన్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు చెబుతున్నారు. ఈ రెండింటిలో ఏది వాస్తవమో తేల్చాల్సిన రెవెన్యూ యంత్రాంగం గోడ మీద పిల్లిలా వ్యవహరిస్తోంది. ఎందుకంటే.. జిల్లాలో ఏ రెవెన్యూ కార్యాలయంలోనూ సరైన రికార్డులు లేవు. ఉన్నవి కూడా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ట్యాంపర్ అయిపోయాయి. చివరకు జిల్లాలో ఫేక్ పట్టాలు కూడా వెలుగు చూసిన సందర్భాలున్నాయి. ఏది అసలో, ఏది నకిలీయో తేల్చలేని పరిస్థితుల్లో తహసీల్దార్లు ఉన్నారు. గతంలో గార తహసీల్దార్‌గా పని చేసినవారిలో ఎవరైనా పట్టాలిచ్చారా? లేదా? అని కూడా తేల్చి చెప్పలేకపోతున్నారు. కలెక్టర్ దీనిపై సీరియస్‌గా ఉన్నందున బరాటం చెరువులో ఆక్రమణలను తొలగించాలని భావిస్తున్నారు. అందులో భాగంగానే గార తహసీల్దారు బృందం నిర్వహించిన సర్వే ఆధారంగా ట్రెంచ్ తవ్వాలని ప్రతిపాదన పంపించారు. దీంతో డ్వామా అధికారులు అంచనాలు రూపొందించి తహసీల్దారుకు సమర్పించి అనుమతి కోరినట్టు తెలిసింది. తహసీల్దారు అనుమతి వచ్చిన వెంటనే ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టి శాశ్వతంగా చెరువు గర్భంలో ఆక్రమణలు తొలగించాలని అధికారులు భావిస్తున్నారు.

### ఆక్రమణలో పదెకరాలు

అంపోలు రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 199లో ఉన్న బరాటం చెరువు పూర్తి విస్తీర్ణం - మిగతా చివరి పేజీలో












• ఎడిటోరియల్

# ఎదురుదాడి.. మావోల సైద్ధాంతిక చర్య!

మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఒక అదనపు ఎస్పీ దుర్మరణం చెందారు. అంతకు ముందు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో మావోయిస్టులు రెండు మూడు ట్రాక్టర్లను దహనం చేశారు. దీనిపై విచారణకు వెళ్లిన ఏఎస్పీ మందుపాతర పేలుడులో మృతి చెందినట్లు వచ్చిన వార్తలను చూసి చాలామంది విస్మయం చెంది ఉండవచ్చు. ఎందుకంటే ఇటీవలి కాలంలో మావోయస్టులకు వరుసగా కోలుకోలేని ఎదురుదెబ్బలే తప్ప ఎదురు దాడులు చేసేంత పరిస్థితి లేదు. దేశంలో మావోయిస్టులను పూర్తిగా అంతమొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో విస్తరించి ఉన్న దండకారణ్య ప్రాంతంలో ఆపరేషన్ కగార్ చేపట్టినప్పటి నుంచి మావోయిస్టు పార్టీ గతంలో ఎన్నడూ ఎదుర్కోనంత ఎదురుదెబ్బలు తింటోంది. అటవీ ప్రాంతాలను, గిరిజన తండాలను కేంద్ర, రాష్ట్రాల సాయుధ భద్రతా బలగాలు జల్లెడ పడుతూ మావోయిస్టు క్యాడర్‌ను, సానుభూతిపరులను ఏరిపారేస్తున్నాయి. బలగాల ధాటికి అగ్రశ్రేణి నాయకులు కూడా పిట్టల్లా రాలిపోతున్నారు. గత మూడు నెలల్లోనే పార్టీ మూల స్తంభాలైన సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు, కేంద్ర కమిటీ సభ్యులు చలపతి, సుధాకర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్, తదితరులను కోల్పోయింది. క్యాడర్ చెల్లాచెదురైంది. చాలామంది లొంగిపోయారు. కొందరు పోలీసులకు కోవర్టులుగా మారారు. మొత్తంగా పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. భద్రతా బలగాలు విరుచుకుపడుతున్న ఇలాంటి పరిస్థితుల్లో మావోయిస్టులు కౌంటర్ అటాక్ (ఎదురు దాడి)కు దిగుతుందా అన్న అనుమానాలు కలగడం సహజమే. కానీ ఇది వాస్తవం. ప్రతి ఏటా జనవరి నుంచి జూన్ వరకు మావోయిస్టులు జరిపే వ్యూహాత్మక దాడుల్లో ఇది భాగమని మావోయిస్టు ఉద్యమంపై అవగాహన ఉన్నవారు పేర్కొంటున్నారు. పార్టీ ఉనికికే ముప్పు వాటిల్లిన తరుణాల్లో దాడులు చేయడం మావోయిస్టు సిద్ధాంతంలో భాగం. పార్టీ క్యాడర్‌లో నైతిక స్థైర్యం పెంచడమే ఈ ఎదురు దాడుల లక్ష్యం. మావోయిస్టు పార్టీ తమ సుప్రీం లీడర్ నంబాల కేశవరావునే కోల్పోయింది. ఇది పార్టీ క్యాడర్‌ను, సానుభూతిపరులను తీవ్ర నిరాశ, ఆందోళన కలిగించే అంశం. ఇలాంటి సందర్భాల్లో చేసే దాడులు క్యాడర్‌లో ఉత్సాహం నింపుతాయి. నైతిక స్థైర్యాన్ని పెంచి మళ్లీ పోరాటం దిశగా నడిపిస్తాయని మావోయిస్టు సిద్ధాంతకర్తలు చెబుతారు. పార్టీ బలంగానే ఉందన్న సందేశం ఇవ్వడానికి ఈ దాడులు ఉపయోగపడతాయని చెబుతారు. భద్రతా దళాలు మావోయిస్టులను బలహీనపరిచాయని, ఇక ఆ పార్టీ బతికి బట్టకట్టడం కష్టమన్న ప్రచారం సాగుతున్న తరుణంలో తమ పార్టీని అంత తేలికగా తీసిపారవేయవద్దనే సంకేతాన్ని ప్రభుత్వానికి, ప్రజలకు, అంతర్జాతీయ సమాజానికి తెలియజెప్పడమే ఈ ఎదురు దాడి ఉద్దేశం కావచ్చు. భద్రతా బలగాలు కీలక నాయకులను హతమార్చినప్పుడు దానికి ప్రతీకారం తీర్చుకోవడం మావోయిస్టు పార్టీ సిద్ధాంతాల్లో ఓ భాగం. పోలీసు బలగాలపై ఒత్తిడి పెంచడం, వ్యూహాత్మకంగా వెనకడుగు వేసేలా చేయడం దీని లక్ష్యం. భద్రతా బలగాలు అమాయకులైన గిరిజనులను కూడా ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపుతున్నాయని, అందుకే వారిపై ప్రతీకార దాడులు చేస్తున్నట్లు మావోయిస్టు నేతలు చెబుతుంటారు. తమ నేతలను మాత్రమే కాకుండా అమాయక అటవీ ప్రాంత ప్రజలను ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని చెప్పడం, దాన్ని ఎదుర్కోవడానికే ప్రతీకార దాడులని ప్రచారం చేయడం ద్వారా ప్రజల మద్దతు, సానుభూతిని మావోయిస్టు పార్టీ పొందుతోంది. ఈ వ్యూహంతోనే సిద్ధాంతపరమైన దాడులకు ఆ పార్టీ వ్యూహరచన చేస్తుంది. పార్టీకి ఎదురుదెబ్బలు తగిలినప్పుడు, తమపై భద్రతా బలగాలు పైచేయి సాధించకుండా చూడటంతో పాటు పోలీసు బలగాలపై మానసికంగా ఒత్తిడి పెంచే లక్ష్యంతో ఇలాంటి ప్రతీకార దాడులకు పాల్పడుతుంటారు. సాయుధ పోలీసు బలగాలపై మెరుపు దాడులకు దిగడం, వారిని లక్ష్యంగా చేసుకుని మందుపాతరలు పేల్చడంవల్ల వారి కదలికలను నియంత్రించడం కూడా ఒక వ్యూహం. ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా తమ విప్లవం, తమ సిద్ధాంతం సజీవమైనవని సమాజానికి, సర్కారుకు సందేశం ఇచ్చే ఉద్దేశంతో కూడా ఇలాంటి దాడులకు మావోయిస్టు పార్టీ సిద్ధపడుతుంది. తాము చేసే ప్రజా డిమాండ్ల చర్చ జరగడానికి కూడా ఇలాంటి దాడులు సహకరిస్తాయన్నది మావోయిస్టు వ్యూహకర్తల నమ్మకం. ఒకనాటి పీపుల్స్‌వార్ సిద్ధాంతం ప్రకారం విప్లవకారుడు దీర్ఘకాలిక ప్రజాయుద్ధం దిశగా నడవాలి. రాజ్యం నిర్బంధం పెంచినా, వర్గ నిర్మూలన చర్యలు చేపట్టినా సిద్ధాంతపరంగా ఎదుర్కొంటూ ముందుకు సాగిపోవాలి. అందుకు అవసరమైతే ఎదురుదాడులు వారి సైద్ధాంతిక వ్యూహం.

# ఎండీయు వ్యవస్థ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎండీయూ వ్యవస్థ రద్దు చేయడం ద్వారా 20 వేల కుటుంబాలు రోడ్డున పడతాయని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఎండీయు ఆపరేటర్ల రాష్ట్ర గౌరవాధ్యక్షులు రౌతు సూర్యనారాయణ, ట్రేడ్ యూనియన్ జేఏసీ నాయకులు తిరుపతిరావు కోరారు. నగరంలోని ఎన్‌జీవో హోం నుంచి జిల్లాపరిషత్ వరకు సోమవారం జిల్లాలో ఉన్న ఎండియు ఆపరేటర్స్ అందరితో కలిపి ర్యాలీని నిర్వహించారు. ఆరు సంవత్సరాలు తమను విధుల్లోకి తీసుకోవాలని అగ్రిమెంట్ ఉన్నప్పటికీ తమను అర్థాంతరంగా విధుల్లో నుంచి తొలగించడం తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే బండి మీద ఉన్న ఫైనాన్సు బ్యాంకు వారు క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. జూన్ ఒకటో తారీకు నుండి 8 వరకు సుమారు 232,167 కేజీలు. (4644 బస్తాలు) రైస్ మాఫియా రెచ్చిపోతుంటే వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో తక్షణమే తెలియజేయాలని కోరారు. గత రెండు సంవత్సరాల ఆరు మాసాలుగా ఉన్న ఎండీఎం, ఐసిడిఎస్ బకాయిలు వెంటనే వేయాలని కోరారు. మా వెహికల్ మీద ఉన్న 90 శాతం సబ్సిడీ అమౌంట్‌లో 30శాతం సబ్సిడీ అమౌంట్ నెల నెల తమ బ్యాంకు ఖాతాల నుండి తీసుకున్న 52నెలల అమౌంట్‌ని తక్షణమే బ్యాంకు ఖాతాలలో వేయాలని డిమాండ్ చేశారు. కాల పరిమితి ఉండగా తమను తొలగించినందుకు మా కుటుంబాలకు ఉపాధి కల్పించాలని కోరారు. మొబైల్ క్యాంటీన్‌గా ఉన్న మా వెహికల్స్‌ను గూడ్స్ క్యారియర్‌గా క్లియరెన్స్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2025 మార్చి 1న మా వ్యక్తిగత ఖాతాలో కట్ చేసిన వెహికల్ ఇన్సూరెన్స్ అమౌంట్ వెంటనే మాకు ఇవ్వాలని చెప్పారు. ఉద్యోగ భద్రత కల్పించాలని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం మొబైల్ డెలివరీ యూనిట్ (ఎండీయూ) వ్యవస్థను రద్దు చేశారని, సమయం వచ్చినపుడు తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ఎండీయూలో 9,260 మంది వ్యక్తులం కాదని, తమ కుటుంబాలు, రేషన్ వాహనాల హెల్పర్ల కుటుంబాలు, 1.45 కోట్ల రేషన్ లబ్ధిదారుల కుటుంబాలున్నాయన్నారు. వైఎస్ జగన్ ఎండీయూల ద్వారా తమకు జీవనోపాధి కల్పిస్తే.. కూటమి ప్రభుత్వం తమ జీవితాలను కూల్చేసిందన్నారు. వరదల్లో, వానల్లో. అమరావతి శంకుస్థాపనల్లో రేయింబవళ్లు పనిచేసిన తమకు రేషన్ వాహనాల రద్దును రిటర్న్ గిఫ్ట్ ఇచ్చిందంటూ రేషన్ డెలివరీ వాహనాల డ్రైవర్లు మండిపడ్డారు. ఎండీయూల రద్దు నిర్ణయానికి వ్యతిరేకంగా పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ ధర్నాచౌక్‌లో మూడు రోజుల శాంతియుత నిరసనల్లో భాగంగా నినదించారు. ప్రభుత్వ సర్వేల్లోనూ రేషన్ సరఫరా వాహనాల వ్యవస్థ ఉండాలని ప్రజలు చెప్పారని, రాజ కీయ కుట్రతో రద్దు చేశారని మండిపడ్డారు. సాక్షాత్తూ సీఎం చంద్రబాబే 74 శాతం మంది ప్రజలు ఎండీయూలను కోరుకుంటున్నందున తాము ఏమీ చేయలేపోతున్నామని చెప్పినా.. ఎందుకు ఎత్తివేశారని నిలదీశారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రేషన్ డెలివరీ వాహనాల డ్రైవర్లు ఈ అభీష్టానికి విరుద్ధంగా ప్రభుత్వ నిర్ణయం ఉందన్నారు. రేషన్ డెలివరీ వాహనాల వ్యవస్థ వచ్చాకే రేషన్ పంపిణీ 90 శాతానికి చేరిందని తెలిపారు. డీలర్లు ఇచ్చేటప్పుడు 64 శాతం కూడా ఉండేది కాదన్నారు. ఇంటి వద్దకే నాణ్యమైన బియ్యం వెళ్తే ప్రజలు హాయిగా తీసుకున్నారన్నారు. పంపిణీ పెరగడాన్ని కూడా అక్రమ రవాణాతో ముడిపెట్టేశారని, ఎండీయూలను రద్దు చేసి వాహనాలను ఊరికే ఇస్తున్నట్టు ప్రభుత్వం కలరింగ్ ఇస్తోందని, తాము కట్టిన 10శాతం సొమ్మును మర్చిపోతోందన్నారు. ఇంతకాలం పనిచేసిన తాము 2027 జనవరి వరకు అగ్రిమెంట్ ప్రకారం పనిచేయలేమా? అని ప్రశ్నించారు. విజయవాడ వరదల్లో రోజుకు రూ.1500 ఇస్తామని చెప్పి చేతులెత్తేశారన్నారు. వరద బాధితులకు ఒకరోజు జీతం కింద రూ.56లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇస్తే.. మా సేవలు వాడుకుని బయటకు నెట్టేస్తారా అని ప్రశ్నించారు. స్కూళ్లకు బియ్యం రవాణా చేసినందుకు కమీషన్లు రాలేదన్నారు. గత ప్రభుత్వం బీమా కడితే.. ఈ ప్రభుత్వం ఇవ్వబోమని చెప్పిందన్నారు. 15 తారీకులోగా సానుకూల నిర్ణయం రాకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. తమతోపాటు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉద్యోగాలు కోల్పోయిన 3లక్షలమందిని కలుపుకుని ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఎండియూ మండల ప్రెసిడెంట్ వరాహ నరసింహులు, వాసు, గోపి, హేమంత్, నవీన్, శ్రీనివాస్, వెంకట్రావు, జానకి రావు, మోహన్, సంతోష్, వెంకట్, బాలకృష్ణ, అప్పలనాయుడు, రవి, కేంబూరు అప్పలనాయుడు, అనిల్, రామారావు, కుమార్, దాసు, దీనబంధు, ఉమా మహేశ్వరరావు, కృష్ణ, ప్రసాద్, గోవిందరాజులు, కిల్లి మోహన్, నాగేశ్వరరావు, జిల్లావ్యాప్తంగా ఉన్న ఎండియు ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు

# జేవై విద్యా సంస్థలను సీజ్ చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జేవై స్కూల్‌ను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. విద్యాసంస్థల విద్యా దోపిడీ విద్యా మాఫియా అక్షరాలపై లక్షల వ్యాపారాన్ని వ్యతిరేకిస్తూ జిల్లాలో అనుమతులు లేకుండా నడుపుతున్న శ్రీచైతన్య, నారాయణ ప్రైవేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని సోమవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సాయికుమార్ మాట్లాడుతూ జిల్లాలో శ్రీ చైతన్య, నారాయణ ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి లక్షల రూపాయలు దండుకుంటున్న జిల్లా విద్యాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడానికి కూడా భయపడుతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా విద్యాసంస్థలు నడుపుతున్నారన్నారు. శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలలో విద్యార్థులకు రకరకాల గ్రూపులు ఏర్పాటు చేసుకొని లక్షల రూపాయలు ఫీజులు పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దండుకుంటున్నారన్నారు. జిల్లాలో సీబీఎస్ఈ పర్మిషన్ లేకపోయినా సీబీఎస్సీ అని ఏర్పాటు చేసుకొని ఇక్కడున్నటువంటి విద్యార్థుల కర్నూలుకి తీసుకొని వెళ్లి పరీక్షలు రాపిస్తున్నారని పేర్కొన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థలు చేస్తున్నటువంటి విద్యా దోపిడీ మాఫియా జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలిసినా కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పుస్తకాల పేర్లతో వేల రూపాయలు వసూలు చేస్తూ విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉన్నప్పటికీ తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి వేల రూపాయలు దండుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తాము విద్యార్థులకు ప్రతి శనివారం సెలవు ప్రకటించాలి నో బ్యాక్ డే ఉండాలి క్రీడలు ఆడించాలని పత్రికా ప్రకటన ఇస్తున్నప్పటికీ వాటిని తుంగలో తొక్కుతూ విద్యార్థులను క్రీడల వైపు చూడకుండా వారిని యంత్రాల్లాగా తయారు చేసే విధంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా వీటికి అడ్డుకట్టు వేయకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పలాస నియోజకవర్గ అధ్యక్షులు సూర్య, విజయ్,చిరు, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.







లిబిలి పలుకుల చిలిపిగ పలికిన ఓ మైనా మైనా,
కిలకిల నగవుల వలపులు చిలికిన ఓ మైనా మైనా,
మిలమిల మెరిసిన తార మిన్నులు వీడిన సితార.
'ల'లను నర్తింపచేసారు వేటూరి . కిన్నెరసాని వచ్చిందమ్మా వెన్నెల పైటేసి. వెన్నెల పైట వేయటం!! అలా పైట వేయించటం వేటూరికే సాధ్యం. సాగరసంగమం కోసం వ్రాసుకున్నారట. ఈ సితార సినిమాలో తళుక్కమంది. శంకరాభరణం, సాగరసంగమం వంటి కళాఖండాలు తీసిన ఏడిద నాగేశ్వరరావు గారి పూర్ణోదయా బేనరుపై వచ్చిన ఈ సితార సినిమా మరో క్లాసిక్‌గా నిలిచిపోయింది. సంగీత సాహిత్య నాట్య సమ్మిళితం ఈ సితార. వేటూరి పాటలు, ఇళయరాజా సంగీతం, యం వి రఘు ఫొటోగ్రఫీ, శేషు నృత్య దర్శకత్వం, వంశీ సృజనాత్మక దర్శకత్వం, భానుప్రియ కళ్ళు, నవ్వు, నాట్య ప్రావీణ్యత సినిమాను ఓ మ్యూజికల్ విజువల్ స్ప్లెండర్‌గా తీర్చిదిద్దాయి.

- సుబ్రమణ్యం దోగిపర్తి

# ఇది వంశీ కళాఖండం!

చతుర నిర్వహించిన నవలల పోటీలలో బహుమతి పొందిన వంశీ రచించిన మహల్లో కోకిల నవల ఆధారంగా ఈ సినిమాను తీసారు. వంశీకి ఇది రెండో సినిమా. అద్భుతంగా చిత్రీకరించారు. బాపు+విశ్వనాధ్ = వంశీ. బాపు లాగా ప్రకృతే కేన్వాసుగా, విశ్వనాథ్ లాగా సంగీత సాహిత్య నాట్యాలను మిళితం చేసి, ఓ గొప్ప సినర్జీని వండారు. ప్రధానంగా చెప్పుకోవలసింది పాటలు, నృత్యాలు. పగటి వేషగాళ్ళ బృందంలో సభ్యుడిగా రాజా గారి అంతఃపురం ముందు సుమన్ నృత్యాలు సూపర్బ్. సువర్ణతో కలిసి సుమన్ నృత్యించిన నృత్యాలు ఫ్రేంలో ఉన్నది సుమనా కమల్ హాసనా అని అనిపిస్తుంది. సాగరసంగమంలో కమల్ హాసనే గుర్తుకొస్తాడు. అర్జున మంత్రం అపురూపం అంటూ సాగే ఆ పాటను వేటూరి ఎంత గొప్పగా వ్రాసారో! వెన్నెల్లో గోదారి అందం అది కన్నుల్లో కన్నీటి రూపం పాట మరో గొప్ప శ్రావ్యమైన పాట. ఈ పాటకే జానకమ్మకు జాతీయ స్థాయిలో అవార్డు కూడా వచ్చింది. కుకుకూ కోకిల రావే డ్యూయెట్ సుమన్, భానుప్రియల మీద చాలా బాగుంటుంది. నీ గానం మృదుమధురం పావనం మరో శ్రావ్యమైన పాట. ఈ సినిమా ఘనవిజయానికి ప్రధాన కారణాలు పాటలు, నృత్యాలు, లోకేషన్లు. సినిమా కధకు ఎలాంటి కోట కావాలో కరెక్టుగా అలాంటి పాతబడ్డ కోట దొరకటం కూడా కలిసొచ్చింది. వెంకటగిరి దగ్గర పాతబడ్డ కోట అట. కోటకు సంబంధించిన సీన్లన్నీ అక్కడ తీసి మిగిలిన సినిమా అంతా గోదావరి ప్రాంతంలో షూటింగ్ చేసారు, భానుప్రియ, సుమన్ల తర్వాత అభినందించవలసింది శరత్ బాబునే. చాలా గొప్ప పాత్ర లభించింది. చినిగిపోయిన చొక్కాను, దారిద్ర్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే కోటు వేసుకునే బతికి చెడ్డ రాజా వారిగా, ఫ్రస్ట్రేషన్లో చిలకల్ని హింసించే సేడిస్టుగా, మంచితనాన్ని పూర్తిగా పోగొట్టుకోలేని మనిషిగా ఆత్మహత్యే కరెక్ట్ అనుకునే పాత్రలో శరత్ బాబు ప్రేక్షకులు మరచిపోలేని నటనను ప్రదర్శించాడు. మరో ముఖ్య పాత్ర శుభలేఖ సుధాకరిది. కధానాయికకు స్నేహితుడిగా, సంరక్షకుడిగా బాగా నటించాడు. మరో ముఖ్య పాత్ర సువర్ణది. సుమన్ తో సమానంగా నర్తించింది. ఇతర పాత్రల్లో సాక్షి రంగారావు, రాళ్ళపల్లి, ప్రభాకరరెడ్డి, మల్లిఖార్జునరావు, జెవి సోమయాజులు, ప్రభృతులు నటించారు. సినిమా విడుదలయిన మొదటి వారం పది రోజుల్లో శంకరాభరణం లాగానే నిరుత్సాహ పరిచిన ఈ సినిమా వర్డ్ ఆఫ్ మౌత్ ప్రచారంలో ఘనవిజయం సాధించింది. 12 కేంద్రాలలో వంద రోజులు ఆడింది. రష్యాలో కూడా రిలీజయింది. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా అవార్డు పొందింది. విశ్వనాథ్ కళాఖండాలయిన శంకరాభరణం, సాగరసంగమం, స్వర్ణకమలం, సిరివెన్నెల సినిమాల సరసన పీట లభించింది ఈ సితారకు. బహుశా మాతరంలో చూడనివారు ఎవరూ ఉండరు. ఈతరంలో ఎవరయినా ఉంటే అర్జెంటుగా చూసేయండి ఈ శ్రవణ దృశ్య కావ్యాన్ని. యూట్యూబులో ఉంది.



స్వయంగా శాస్త్రీయ నృత్యకారిణి అయిన భానుప్రియ చేత నృత్య దర్శకుడు శేషు అద్భుతమైన నృత్యాలను చేయించాడు. మొదటి సినిమా అయినా భానుప్రియ పరిపక్వతతో నటించింది. దక్షిణ భారత చిత్ర రంగానికి లభించిన అందాల భరిణ.

# సూపర్ హిట్టు వచ్చినా ఆమెను పట్టించుకోరేంటి..?



టాలెంట్ ఉన్నా కూడా కొంతమంది హీరోయిన్స్‌కి ఎందుకో పెద్దగా లక్ కలిసి రాలేదు. అయినా సరే వాళ్ల టాలెంట్‌తో నెట్టుకొస్తుంటారు. అలాంటి వారిలో ఒకరు చెన్నై చిన్నది ఐశ్వర్య రాజేష్. తెలుగు మూలాలున్న ఈ భామ తమిళ్‌లో పుట్టి పెరగడం వల్ల అక్కడ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. సినీ నేపథ్యం ఉన్నా కూడా అవకాశాల కోసం కొత్త వాళ్ల లానే కష్టపడింది. తమిళ్‌తో పాటు మలయాళ, కన్నడ సినిమాలను చేస్తూ తెలుగులో వరల్డ్ ఫేమస్ లవర్ చేసింది. ఆ సినిమా ఫ్లాప్ అవ్వడం వల్ల అమ్మడికి లక్ కలిసి రాలేదు. ఐతే ఐశ్వర్యని చూస్తే కట్టుబొట్టు చక్కని తెలుగు అమ్మాయిలానే ఉంటుంది. అందుకే అమ్మడికి లేట్ అయినా సక్సెస్ వచ్చింది. విక్టరీ వెంకటేష్ చేసిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో అమ్మడు సూపర్ హిట్ అందుకుంది. ఆ సినిమాలో ఐశ్వర్య రాజేష్ పాత్ర ఆడియన్స్‌ని ఖుషి చేసింది. ఐతే ఇన్నాళ్లు తెలుగులో సక్సెస్ లేదు కాబట్టి అవకాశాలు రాలేదు అనుకున్నారు కానీ సంక్రాంతికి వస్తున్నాం లాంటి బ్లాక్ బస్టర్ పడ్డాక కూడా అమ్మడికి మరో ఛాన్స్ రాలేదు.

సూపర్ హిట్ కొట్టాక కూడా అవకాశం రాకపోవడం షాకింగ్‌గానే ఉంది. ఐశ్వర్య రాజేష్ ప్రస్తుతం తమిళ్‌లో 3 సినిమాలు చేస్తుంది. అందులో ఒకటి పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటుంది. రెండు సినిమాలు సెట్స్ మీద ఉన్నాయి. వీటితో పాటు అమ్మడు ఓ కన్నడ సినిమా చేస్తుంది. తెలుగులో ఇంకా ఇంకా సినిమాలు చేయాలని ఉందని ఐశ్వర్య కోరుతున్నా ఆమెకు సరైన ఛాన్స్‌లు మాత్రం రావట్లేదు. ఐశ్వర్య రాజేష్ మాత్రం ఓ పక్క కోలీవుడ్‌లో వరుస ప్రాజెక్ట్ లు చేస్తూనే తెలుగు నుంచి వచ్చిన ఛాన్స్ లు చేస్తుంది. సంక్రాంతికి వస్తున్నాం తర్వాత అనిల్ రావిపూడి చేస్తున్న మెగా 157 లో కూడా ఐశ్వర్య రాజేష్ నటిస్తుందని టాక్ నడుస్తుంది. అదే నిజమైతే మాత్రం ఐశ్వర్య పంట పండినట్టే లెక్క. ఆల్రెడీ చిరంజీవి సినిమాలో నయనతార హీరోయిన్ గా ఫిక్స్ అయ్యింది. ఐశ్వర్య రాజేష్ చేసినా సెకండ్ హీరోయిన్ గా చేయాల్సిందే. మరి ఆ ఛాన్స్ కూడా ఉందో లేదో త్వరలో తెలుస్తుంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..



# ఏమిటీ డిజీలక్ష్మీ పథకం.. ఎవరెవరు అర్హులు?




ప్రజలకు వేగంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆన్‌లైన్ సర్వీసులు అందించడంతో పాటు విద్యావంతులైన డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఆంధ్ర ప్రదేశ్ సర్కారు "డిజిటల్ లక్ష్మీ (డిజీలక్ష్మీ)" పేరిట వివిధ సేవలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది.

ఈ డిజిటల్ సేవా కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన కార్యక్రమ తుదిరూపుపై కసరత్తు చేస్తున్న ప్రభుత్వం త్వరలోనే అధికారిక ఉత్తర్వులివ్వనుందని పట్టణ పేదరిక నిర్మూలన మిషన్ (మెప్మా) అదనపు మేనేజింగ్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు బీబీసీకి తెలిపారు.

మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందేలా చేయడమే ఈ పథకం లక్ష్యం అలాగే డ్వాక్రా సంఘాల్లోని విద్యావంతులైన మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ "డిజిటల్ లక్ష్మీ" కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని వెంకటేశ్వరరావు చెప్పారు. జూన్ 12న దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందన్నారు

**డ్వాక్రా మహిళలతో సీఎస్సీల ఏర్పాటు**

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే డిజిటల్ ఇండియా నినాదంతో డిజిటల్ సాధికారత లక్ష్యంగా కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్సీ) లను అందుబాటులోకి తెచ్చింది. ఈ సీఎస్సీలు ప్రజలకు వివిధ ఆన్‌లైన్ సర్వీసులు అందిస్తుంటాయి.

ముఖ్యంగా వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించిన సంక్షేమ పథకాలు, ప్రజా వినియోగ సేవలకు ఇవి ప్రవేశ ద్వారాలుగా ఉంటాయి. కేంద్ర నిబంధనల ప్రకారం అర్హులైన విద్యావంతులు ఈ సీఎస్సీ లైసెన్స్ తీసుకోవడానికి సుమారు రూ.లక్షా 50 వేల రూపాయలు



ఖర్చవుతుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ లక్షా 50వేల ఖర్చును మాఫీ చేయించి డ్వాక్రా మహిళలకు తొలివిడతగా రాష్ట్రంలో 10వేల సీఎస్సీలను ఇప్పించాలని నిర్ణయించింది. ఆ మేరకు ఇప్పటికే సీఎస్సీ సేవలు అందించే ఈ గవర్నెన్స్‌తో మెప్మా ఎంవోయూ చేసుకుందని మెప్మా ఏఎండీ వెంకటేశ్వరరావు వెల్లడించారు.

**ముందుగా 10వేల కేంద్రాలు**

ముందుగా నగరాలు, పట్టణాల్లో ప్రతి 250 ఇళ్లకు ఒక డిజిటల్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. తొలి దశలో రాష్ట్ర వ్యాప్తంగా 10వేల కేంద్రాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఈ సేవాకేంద్రాల ఏర్పాటుకు అర్హత సాధించిన మహిళలు తమ ఇంటి ముందు లేదా ఇంటికి సమీపంలో ఒక చిన్న దుకాణం (మీ సేవా కేంద్రం తరహా) ఏర్పాటు చేసి, ప్రజలకు అవసరమైన సేవలు అందించాలి. ఈ క్రమంలో ఇప్పటికే స్వయం సహాయక సంఘాల్లో డిగ్రీ పూర్తి చేసిన, కంప్యూటర్ నైపుణ్యం ఉన్న వారిని గుర్తిస్తున్నారు.

**ఏయే సేవలు లభిస్తాయంటే...**

పింఛన్, రేషన్ కార్డు, హెల్త్ కార్డు, రైతు భరోసా వంటి సేవలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన పూర్తి సమాచారం అందించడం, దరఖాస్తు చేయించడం, ప్రభుత్వాల నుంచి పౌరులకు అందే సిటిజెన్ సర్వీసులు, ఆధార్ అప్‌డేట్, పాన్ అప్లికేషన్, బ్యాంకులకు రుణాలు,



డిపాజిట్‌ల చెల్లింపులు, బీమా పెట్టుబడులు, చెల్లింపులు, ఈ-మొబిలిటీ, రైల్వే, బస్ టికెట్ బుకింగ్.. వంటి ఇతర డిజిటల్ సేవలు అందుబాటులో ఉంటాయి. అదేవిధంగా అసంఘటిత రంగ కార్మికుల కోసం కార్మికశాఖ ప్రవేశపెట్టిన 'ఈ-శ్రమ్' పథకానికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ఈ సెంటర్లలో చేసుకోవచ్చు.

**అర్హులెవరు?**

కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి 21 సంవత్సరాల నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న డ్వాక్రా మహిళలు ఈ కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటుకు అర్హులు. ఈ సెంటర్ ఏర్పాటుకు స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, బయో మెట్రిక్ డివైజ్, ఇతరత్రా సామగ్రి అవసరమవుతుంది. ఇందుకు దాదాపు రూ.2లక్షలు ఖర్చు కానుంది. ఎంపికైన మహిళలకు రూ.2 లక్షల రుణం మెప్మానే బ్యాంకుల నుంచి ఇప్పిస్తుంది. ఆయా సేవలకు సర్వీస్ చార్జీలు తీసుకోవడం ద్వారా ప్రతి సెంటర్‌కు నెలకు కనీసంగా రూ.30వేల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా ఇంటి వద్దనే ఉపాధి పొందడం ద్వారా డ్వాక్రా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు మంచి అవకాశమని మెప్మా ఏఎండీ వెంకటేశ్వరరావు అన్నారు.



**ఎంపిక ఎలా జరుగుతుందంటే...**

డిజీలక్ష్మీ కేంద్రాల కోసం ఇప్పటికే చాలామంది డ్వాక్రా మహిళలు దరఖాస్తు చేసుకుంటున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ గ్రూపుల్లో ఉన్న సభ్యుల విద్యార్హత, నిబంధనల మేరకు వారి అర్హతలను బట్టి ఉన్నతాధికారులు మహిళలను ఎంపిక చేస్తారు. తన పరిధిలోనే వందలమంది డ్వాక్రా మహిళలు దరఖాస్తు చేసుకున్నారని, ఇంకా ప్రాసెస్ జరుగుతోందని విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని యూసీడీ అధికారి జగదీశ్వరి బీబీసీకి చెప్పారు.

**ఎన్ని అందుబాటులోకి వచ్చినా.. ఇవి అవసరమే**

ఇప్పుడు చాలా సౌకర్యాలు, సేవలు స్మార్ట్ ఫోన్‌లోనే లభిస్తున్నాయి. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో మీ-సేవా కేంద్రాల్లో అవసరమైన పౌరసేవలు అంటుబాటులో ఉన్నాయి. అలాంటప్పుడు ఈ కొత్త డిజీ లక్ష్మీ కేంద్రాలతో ఉపయోగం ఏముంటుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై మెప్మా స్టేట్ మిషన్ మేనేజర్ రంగాచార్యులు బీబీసీతో మాట్లాడారు. "మురికివాడల్లోని ప్రజలు, అసంఘటిత రంగంలోని కార్మికులకు ఇంకా ఈ డిజిటల్ సేవలపై పూర్తి అవగాహన లేదు. అలాంటి వాళ్లు నగరంలో అక్కడక్కడా ఉండే మీ సేవా సెంటర్లకు వెళ్లే బదులు తమ ఇంటి దగ్గరలోనే తమకు తెలిసిన స్థానిక మహిళ నిర్వహించే ఈ సెంటర్‌కు వెళ్తే చాలా సులువుగా సౌకర్యాలు పొందొచ్చు" అని మెప్మా స్టేట్ మిషన్ మేనేజర్ రంగాచార్యులు బీబీసీకి చెప్పారు. **- బీబీసీ సౌజన్యంతో..**



## రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ కరువైంది

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



ఆంధ్రప్రదేశ్‌లో ఆడబిడ్డలకు రక్షణ కరువైందని, గత ఏడాది కాలంగా ఇది స్పష్టంగా రుజువవుతూనే ఉందని వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతంగా ఏపీలో ఆడబిడ్డలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఒక్క సంవత్సరంలోనే ఏకంగా 188 మందికి పైగా ఆడబిడ్డలపై అఘాయిత్యాలు జరిగాయన్నారు. ఈ దారుణ సంఘటనలు రాష్ట్రంలో మహిళల భద్రతకు ఏపాటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందో స్పష్టం చేస్తున్నాయన్నారు. ఓ వైపు రాష్ట్రంలో అసాంఘిక శక్తులు.. మహిళలు, బాలికలపై విచ్చలవిడిగా అత్యాచారాలకు పాల్పడుతున్నా, నిమ్మకు నీరెత్తినట్టు టీడీపీ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుదన్నారు. మహిళలు, బాలికలపై యథేచ్ఛగా అఘాయిత్యాలతో ఆంధ్రప్రదేశ్ అంతటా భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మహిళా భద్రతకు పెద్దపీట వేసిందని, దిశ చట్టం వంటి విప్లవాత్మక చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మహిళల భద్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, దీనివల్ల రాష్ట్రంలో అరాచకం పెరిగిపోయిందని విమర్శించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో మహిళల భద్రత కోసం తీసుకువచ్చిన "దిశ చట్టం" మరియు "దిశ యాప్" లను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు.

## జర్నలిజం దారి దీపం కావాలి

**(సత్యంన్యూస్, సరుబుజ్జిలి)**



జర్నలిజం దారి దీపం కావాలి గానీ,తగులబెట్టే కొరివి కాకూడదని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు చెప్పారు. మంగళవారం ఉదయం స్థానిక ఒక ప్రైవేటు విద్యా సంస్థలో సర్వ సభ్య సమావేశం సీనియర్ జర్నలిస్ట్ బెండి శ్యామల రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు మాట్లాడుతూ, మీడియాపై అలముకున్న రాజకీయ నీలినీడలను వివరించారు. రాజకీయ పగ, ప్రతీకారాలకు క్షేత్రస్థాయి జర్నలిస్టులు బలి పశువులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యమత్యం ద్వారానే, దాడులను సమర్థంగా ఎదుర్కోగలమని స్పష్టం చేశారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు ఈ మండలంలోని పర్వతాలపేట అగ్రహారంలో జన్మించారని, ఆయన స్ఫూర్తితో జర్నలిస్టులు పనిచేయాలని కోరారు. జాతీయ గేయ కవితా సార్వభౌముడు గరిమెళ్ళ సత్యనారాయణ కూడా ఇదే మండలంలో జన్మించినట్లు తెలిపారు.' సాక్షి ' కార్యాలయ భవనాలపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.ఈశ్వర రావు మాట్లాడుతూ, జర్నలిస్టుల కష్టసుఖాలలో ఏపీయూడబ్ల్యూజే అండదండగా నిలబడుతుందని చెప్పారు. ఒకరిద్దరూ జర్నలిస్టులు చేసే తప్పుడు పనులు వల్ల వాటితో సంబంధంలేని అందరికీ చెడ్డ పేరు వస్తుందని, అటువంటి జర్నలిస్టులను యూనియన్ కు దూరంగా ఉంచాలని ఆయన సూచించారు. ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు బెండి శ్యామలరావు మాట్లాడుతూ, స్థానిక ప్రెస్‌క్లబ్‌కు గిడుగు రామమూర్తి పంతులు పేరును పెడుతున్నట్లు ప్రకటించారు. త్వరలో దీన్ని ప్రారంభోత్సవం జరుగుతుందని చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఎన్ ఈశ్వరరావు వ్యవహరించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కూటి కప్పల తారకేశ్వరరావు, బగాది భాస్కరరావు, ఉపాధ్యక్షులుగా బాడాన మహేష్, జాయింట్ సెక్రటరీగా ఎస్ అసిరినాయుడు, కోశాధికారిగా యండ అన్నం దొర, న్యాయ సలహాదారుగా బగాది ధనంజయరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో నలుగురు కార్యవర్గ సభ్యులుగా కూడా ఎన్నికయ్యారు.

## ఆరు నెలల చిన్నారికి అండగా ఎన్టీఆర్ ఎం.ఎస్.ఎస్ టీం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

నందమూరి బాలకృష్ణ అభిమానులు సేవా తత్పురుషులని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు.శంకర్ అన్నారు. స్థానిక విశాఖ కోలనీ టీడీపీ కార్యాలయంలో బాలకృష్ణ జన్మదినం సందర్భంగా నిర్వహించిన జన్మదిన వేడుకల సేవా కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని కేక్ కట్ చేసిన అనంతరం మాట్లాడుతూ బాలకృష్ణ జన్మదినవేడుకలు సేవా కార్యక్రమంతో చెయ్యటం బావోద్వేగంగా ఉందన్నారు. ఎన్టీఆర్ ఎం.ఎస్. ఎస్ టీం డేవిడ్ మాదారపు, తండ్రి మాదారపు. వెంకటేష్ అడుగుజాడల్లో నిలుస్తూ, వారి ఆధ్వర్యంలో టెక్కలి చెందిన ఆరునెలల చిన్నారికి అండగా నిలిచారని, చిన్నారి లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతుందని, ఎన్టీఆర్ ఎం.ఎస్.ఎస్ టీం సభ్యుల సహకారంతో ఆ చిన్నారికి రూ.25వేలు అందజేశారన్నారు. ఎన్టీఆర్ ఎం.ఎస్.ఎస్ టీం సభ్యులు నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగించటం ఆనందదాయకమన్నారు. అనంతరం మాదారపు వెంకటేష్ మాట్లాడుతూ సంచలనాత్మక ఎమ్మెల్యే గొండు శంకర్ అని, శ్రీకాకుళం చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచారని, ఊహకందని అత్యధిక ఓట్లతో గెలుపొంది, శ్రీకాకుళాన్ని అభివృద్ధి, ప్రగతిపథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రతీ సమస్యకు సత్వర పరిస్కారమే ధ్యేయంగా పనిచేస్తూ అందరి అభిమానాలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అన్న ఎన్టీఆర్ అభిమానులు, నటసింహం బాలకృష్ణ అభిమానులు, ఎన్టీఆర్ ఎం.ఎస్. ఎస్ టీం సభ్యుల బృందం, కళ్యాణ్‌రామ్, మోక్షజ్ఞ అభిమాన బృందం, టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అభివృద్ధిని చూడలేక అనుచిత వ్యాఖ్యలు

- **వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**
- **తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్**



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు వి.వి.ఆర్.కృష్ణంరాజు, సాక్షి ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్ అన్నారు. వైకాపా అరాచకాలకు అడ్డువెయ్యాలన్న డిమాండ్‌తో స్థానిక సూర్యమహల్ కూడలి నుంచి ఏడురోడ్ల కూడలి వరకు నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతిశంకర్ మాట్లాడుతూ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని, యావత్ ప్రపంచమే దీన్ని ఖండిస్తోందన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తెలుగు మహిళా అధ్యక్షురాల బృందం, టీడీపీ అభిమానులు, కార్యకర్తలు, స్థానికులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## రక్తదానంపై అవగాహన ర్యాలీ




**(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)**

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కాలేజీస్ ఆవరణలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించారు. ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగోజి మాట్లాడుతూ రక్తదాత ప్రాణదాత, స్వచ్ఛంద రక్తదాతలు వల్లనే చాలామంది పునర్జన్మ పొంది జీవిస్తున్నారన్నారు. కాలేజీ పరిపాలన అధికారి బి.తిరుపతిరావు, వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.చిట్టిబాబు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, ఎన్.ఉమాశంకర్ రక్తదాన ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.












# పొరపాటున పొట్టిశ్రీరాములు వైపు రాకండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పాతశ్రీకాకుళం ప్రాంతంలో మంగళవారం సిరిమాను ఊరేగింపు ఉన్నందున ట్రాఫిక్‌ను మళ్లించినట్లు పోలీసులు ప్రకటించారు. అయితే జిల్లాలో వేర్వేరు ప్రాంతాల నుంచి వస్తున్న బంధువులకు ఇది సరిగా అర్థంకాకపోవడం వల్ల ఎప్పటిలాగానే పొట్టిశ్రీరాములు జంక్షన్ నుంచి పాతశ్రీకాకుళం వైపు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ పోలీసులు ఈ విగ్రహం వద్ద నుంచి స్టాపర్లు పెట్టి వాహనాలు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. ఎందుకంటే మరికొద్దిసేపట్లో సిరిమాను ఊరేగింపు ప్రారంభం కానుంది. అదే సమయంలో బంధువుల ఇంట భోజనానికి వెళ్లి వస్తున్నవారు, సిరిమాను ట్రాఫిక్ కలిసిపోతే దాన్ని క్లియర్ చేయడం ఎవరి తరం కాదు. అందుకే పొట్టి శ్రీరాములు బొమ్మ నుంచి రాకపోకలను నిషేధించారు. ఇది తెలియక అటుగా వచ్చినవారు పాతశ్రీకాకుళం వరకు నడవలేక పాట్లు పడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం పరిస్థితే ఇలా ఉంటే సాయంత్రం, బుధవారం కోసం వేరేగా చెప్పనక్కర్లేదు. అందుకే వాహనాల మీద వచ్చేవారు పొరపాటున కూడా పొట్టి శ్రీరాములు జంక్షన్ వైపు రావద్దని పోలీసులు చెబుతున్నారు.




# 'సత్యం' కథనానికి స్పందన

**- ఆక్రమణల తొలగింపు.. రోడ్డు మరమ్మతులు -**

(సత్యంన్యూస్, కొత్తూరు)

'చెరువులను తలపిస్తున్న రహదారులు'పై అధికార యంత్రాంగం స్పందించి. ఆంధ్ర-ఒడిశా ప్రధాన రహదారిగా ఉన్న ఈ రూటులో వర్షాల కారణంగా పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి, అందులో నీరు చేరి వాహనచోదకులు ఇబ్బందులు పడటంతో స్థానికులు, బాటసారులు పడుతున్న ఇబ్బందులను సంచలన సాయంకాల పత్రిక 'సత్యం' గత నెల 14న ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికార యంత్రాంగం నివగాం ఆర్ అండ్ బి రహదారికి ఆనుకొని ఉన్న ఆక్రమణలను తహసీల్దార్ బాలకృష్ణ ఆధ్వర్యంలో తొలగించారు. రహదారి మరమ్మతు పనులను ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# వైకాపా మహిళా విభాగం నిరసన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు నిరసనగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా వైకాపా జిల్లా ఉపాధ్యక్షురాలు మెంటాడ పద్మావతి ఆధ్వర్యంలో వైకాపా మహిళా విభాగం స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నా హోంమంత్రికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. మహిళ హోం మంత్రిగా ఉన్న రాష్ట్రంలో మహిళలుపై దారుణాలు జరగడం సిగ్గు చేటని ఆమె విమర్శించారు. సేవ్ ఉమెన్-సేవ్ ఆంధ్రా నినాదాలతో వైకాపా మహిళా నేతలు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వైకాపా మహిళా విభాగం నుంచి మూకళ్ల సుగుణ, టి.కామేశ్వరి, సుగుణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కపోత నుంచి ఉపశమనం

✔ నగరంలో భారీవర్షం ✔ రోడ్లపై నిలిచిన వాహనాలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గత వారం రోజులుగా భరించలేని ఎండలు, ఉక్కపోతతో సతమతమైన నగర ప్రజానీకానికి మంగళవారం ఉపశమనం లభించింది. సోమవారం రాత్రి 2 గంటల నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని చల్లగా మారింది. ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. అయితే భారీ వర్షం కారణంగా రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. మంగళవారం పాతశ్రీకాకుళంలో అమ్మవార్ల సిరిమాను సంబరం నేపథ్యంలో ఈ వర్షం ఏర్పాట్లకు కొంతవరకు అంతరాయం కలిగించింది. అధికారులు రోడ్లపై నిలిచిన నీరు తొలగించే చర్యలు చేపట్టారు. అమ్మవార్ల సిరిమాను సంబరానికి చల్లదనమని కొందరు అంటుండగా, ఇదే వాతావరణం కొనసాగితే, సిరిమాను సంబరం, బంధువుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే వర్షం కొంతవరకు తెరుపివ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# సెంట్రల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ (శ్రీకాకుళం)లో పలు తరగతులకు సంబంధించి ఖాళీలు భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ బెండి లవకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. క్లాస్-4 (ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు మాత్రమే), క్లాస్-8, క్లాస్-9, క్లాస్10 (కేటగిరీ 1, 2 సీబీఎస్ఈ అఫిలియేటెడ్ స్కూల్‌లో చదివిన విద్యార్థులకు మాత్రమే), క్లాస్-11, క్లాస్-12 కేటగిరీ 1,2 (సీబీఎస్ఈ అఫిలియేటెడ్ స్కూల్‌లో చదివిన విద్యార్థులకు మాత్రమే) ఖాళీలు ఉన్నట్టు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి తల్లి లేదా తండ్రితో సహా ఈ నెల 16వ తేదీలోగా స్కూల్ యాజమాన్యాన్ని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల మధ్య సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో కోరారు.









# పరపతి, ఫోర్జరీల పోటు.. చెరువు ఉనికికే చేటు!





(మొదటిపేజీ తరువాయి)

19.53 ఎకరాలు. కానీ ప్రస్తుతం 9.50 ఎకరాలు మాత్రమే మిగిలింది. సుమారు 9.76 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. చెరువు గర్భాన్ని గ్రామంలోని రెండు



కుటుంబాలకు చెందిన నలుగురు ఆక్రమించినట్టు వారు చెబుతున్నారు. దీనివల్ల సుమారు 200 ఎకరాల చెరువు ఆయకట్టుకు నీరందడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బరాటం చెరువు తన ఎగువ ప్రాంతంలో ఉన్న 163 ఎకరాలతో పాటు వానవానిపేట, తంగివానిపేట, సానివాడ, ఒప్పంగి తదితర గ్రామాల పరిధిలో ఆరు చెరువులకు నీటిని సరఫరా చేసి 728 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. ఆక్రమణల వల్ల రిజర్వు ట్యాంకుగా పని చేయాల్సిన బరాటం చెరువు నిర్వీర్యం అయిపోయిందని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. చెరువులో ఆక్రమణలను తొలగించడానికి ప్రయత్నించిన రెవెన్యూ అధికారులను కొందరు రైతులు అడ్డుకున్నారు. ఆక్రమణదారుల్లో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారని, అతనే కొందరు రైతులను రెచ్చగొట్టి సర్వే చేస్తున్న అధికారులను అడ్డుకోవడానికి ప్రయత్నించారని చెబుతున్నారు. అంతకుముందే ఆక్రమణలపై సానివాడ సర్పంచ్ లక్ష్మి జిల్లా కలెక్టర్‌తోపాటు గార ఎంపీడీవో, శ్రీకాకుళం, గార తహసీల్దార్లకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ గార, శ్రీకాకుళం రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేయడంతో బరాటం చెరువును సర్వే చేసి హద్దులు ఫిక్స్ చేశారు.

**ఫోర్జరీ పత్రాలతో కొందరి వాగ్వాదం**

నిరుపేదలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని కొందరు రైతులు చెబుతున్నారు. అయితే వీటిని ప్రభుత్వం జారీ చేయలేదని, అవి నకిలీవని తేలడంతో పట్టాదారు పుస్తకాలను రెవెన్యూ అధికారులు రద్దు చేశారని తెలిసింది. ప్రస్తుతం చెరువు గర్భంలో సాగుచేస్తున్న ఒకరు 1980లో మంజూరు చేసిందిగా చెబుతూ ఒక పత్రాన్ని రెవెన్యూ అధికారులుకు చూపించగా అది రెవెన్యూ శాఖ జారీ చేసినది కాదని అధికారులు తేల్చారని తెలిసింది. రెవెన్యూ రికార్డులు, ఎస్ఎల్ఆర్ ప్రకారం చెరువుగా రికార్డుల్లో ఉందని చెబుతున్నారు. ఇటీవల ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం చెరువు, శ్మశానవాటిక, రస్తాలో ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. దీనికి కూడా ప్రభుత్వం టార్గెట్ ఇచ్చి నిత్యం సమీక్షిస్తోంది. అందులో భాగంగానే ఆక్రమణలు తొలగించే ప్రక్రియ చేపడుతున్నట్టు గార రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.









Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.